సాక్షి యాదాద్రి భువనగిరి

సోమవారం । 3 । ఏప్రిల్ । 2023



కేసీఆర్ పాలనలో రాష్ట్రం సుభిక్షం

సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉందని మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు.

- 8లో



సంరక్షణ మరిచారు

బొమ్మలరామారం మండలంలోని పలు చోట్ల నాటిన ఈత మొక్కలు సంరక్షణ లేక అన్నీ చనిపోయాయి.

- 9లో

గరిష్టం/కనిష్టం 37°/24°

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉంది.



పాపన్నకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, అధికారులు

భువనగిరిటౌన్ : సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతిని కలెక్టరేట్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ పమేలా సత్పతితో పాటు వివిధ శాఖల అధికారులు పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు యాదయ్య, జయపాల్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్‌కుమార్, బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నారసింహుడికి నిత్యారాధనలు



స్వామివారి దర్శనంకోసం ప్రధానాలయంలో బారులుదీరిన భక్తులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆదివారం నిత్యారాధనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువ జామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు సుప్రభాతం చేపట్టారు. అనంతరం స్వయంభూలకు బిందె తీర్థం, ఆరాధన, బాలభోగం నిజాభిషేకం, సహస్రనామార్చన జరిపించి తులసీ దళాలతో అర్చించారు. ఇక ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజ వాహన సేవ, నిత్యకల్యాణం, జోడు సేవలు నిర్వహించారు. రాత్రి స్వామి వారికి శయనోత్సవంచేసి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు. సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచనం పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

న్యూస్‌రీల్

కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జ్‌ను కలిసిన కుంభం



మాణిక్‌రావు ఠాక్రేతో అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరిటౌన్ : హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆదివారం జరిగిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ మాణిక్ రావుఠాక్రేను కలిశారు. జిల్లాలో పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న హాథ్ సే హాథ్ జోడో అభియాన్ యాత్ర, రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేసిన నేపథ్యంలో చేపడుతున్న కార్యక్రమాలపై ఠాక్రేకు వివరించారు. ఆయన వెంట భువనగిరి మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ పోత్నక్ ప్రమోద్‌కుమార్ ఉన్నారు.

యాదాద్రిలో ముగిసిన వసంత నవరాత్రి ఉత్సవాలు

యాదగిరిగుట్ట : యాదాద్రి కొండపై ఉన్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో గత నెల 22వ తేదీన ప్రారంభమైన శ్రీసీతారామచంద్రస్వామి వసంత నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. శివాలయంలో నిత్యారాధనలు నిర్వహించిన అనంతరం వసంత నవరాత్రి ఉత్సవం, దశశాంతి, పంచసూక్తి పారాయణంతో అభిషేకం చేశారు. అలాగే అధ్యాత్మిక రామాయణ పారాయణం, శ్రీసీతారామ హనుమత్ మూర్తులకు అష్టోత్తర శతనామార్చనలు గావించారు.

75.94 శాతం వసూలు



భువనగిరి మున్సిపల్ కార్యాలయం

భువనగిరిటౌన్ : 2022 – 23 ఆర్థిక సంవత్సరానికి గాను భువనగిరి మున్సిపాలిటీలో ఆస్తి పన్ను 75.94 శాతం వసూలైంది. మార్చి 31వ తేదీ అర్ధరాత్రి వరకు ప్రక్రియ కొనసాగింది. మొత్తం రూ.662.92 కోట్లు డిమాండ్ కాగా రూ.503.42 కోట్లు వసూళ్లు చేశారు. మిగితా రూ.159.50 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో ముఖ్యంగా కోర్టు కేసుల్లో ఉన్న భవనాలు, ప్రభుత్వ భవనాలు, మొండి బకాయిలు ఉన్నాయి. రూ.159.50 కోట్ల వసూలు కోసం ఈనెల 3 లేదా 4వ తేదీన కార్యాచరణ రూపొందించనున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.

వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం



ఉచిత గుండె వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న డీసీహెచ్‌ఎస్ చిన్నూనాయక్

రామన్నపేట : గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయ కర్త (డీసీహెచ్‌ఎస్) డాక్టర్ చిన్నూనాయక్ అన్నారు. ఆదివారం రామన్నపేటలో ఎంపీటీసీ వనం హర్షిణీచంద్రశేఖర్, హైదరాబాద్‌కు చెందిన ప్రతిమ హాస్పిటల్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత గుండె వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వయస్సుతో నిమిత్తం లేకుండా గుండెపోటు వచ్చి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజూ వ్యాయామం చేయడం, సరైన భోజనం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా టు డికో, ఈసీజీ వంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు ప్రవళిక, రాజ్‌కుమార్, ప్రవీణ్, లిఖిత, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సిరిగిరెడ్డి మల్లారెడ్డి, నాయకులు మందడి శ్రీనివాస్‌రెడ్డి, పున్న రమేష్, పిట్ట వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, జైక్రిష్ణ, సురేష్, బాబురావె తదితరులు పాల్గొన్నారు.

వరి కోతలు షురూ

- జిల్లాలో 2,90,873 ఎకరాల్లో సాగు
- గత యాసంగితో పోలిస్తే 1,25,112 ఎకరాలు అదనం
- 6 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా
- హార్వెస్టర్లకు పెరిగిన డిమాండ్



రామన్నపేటలో వరి కోస్తున్న యంత్రం

రామన్నపేట : జిల్లాలో వరి కోతలు మొదలయ్యాయి. డిసెంబర్ ప్రారంభంలో నాట్లు వేసిన పొలాలన్నీ దాదాపు చేతికి వచ్చాయి. కొందరు రైతులు వరి కోతలు మొదలు పెట్టగా వాతావరణంలో సంభవిస్తున్న మార్పులకు భయపడి మిగిలినవారు కూడా సిద్ధమవుతున్నారు. అయితే ఈ నెల 15నుంచి ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిన జిల్లా యంత్రాంగం.. ఇంకా సన్నాహాలు ప్రారంభించలేదు.

పెరిగిన సాగు విస్తీర్ణం

యాదాద్రి జిల్లాలో ఈసారి వరి సాగు గణనీయంగా పెరిగింది. 2,90,873 ఎకరాల్లో సాగు చేశారు. గత యాసంగి సీజన్‌తో పోలిస్తే 1,25,112 ఎకరాలు అదనంగా సాగైంది. గత యాసంగిలో ధాన్యం కొనుగోలు చేయడం లేదని, ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలని సీజన్ ప్రారంభంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో రైతు వరి సాగు తగ్గించారు. దీంతో కేవలం 1,65,761 ఎకరాల్లో మాత్రమే సాగైంది.

దిగుబడిపై భారీ అంచనాలు : జిల్లాలో వానాకాలంలో సాధారణ స్థాయికి మించి వర్షాలు కురిశాయి. భూగర్భజలాలు పెరగడంతో పాటు చెరువులు, కుంటల్లోకి సమృద్ధిగా నీరు చేరింది. మూసీ ఆధారిత కాల్వలకు నిరాటంగా నీటిని విడుదల చేయడంతో రైతులు వానాకాలం సీజన్ మాదిరిగానే యాసంగిలోనూ వరి సాగు చేశారు. అధికారుల అంచనా ప్రకారం 6,40,000 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉన్నది. మార్చి 18,19 తేదీల్లో జిల్లాలో అక్కడక్కడా వడగండ్లతో ల్లో లలో వరి చేలు దెబ్బతిని గింజలు నేల రాలాయి. ప్రస్తుతం వరిచేలు తడి తప్పి ఉన్నాయి. సీజన్ మొదట్లో నాట్లు వేసిన రైతులు కోతలను ప్రారంభించారు.

యంత్రాలకు ఫుల్ డిమాండ్

సీజన్ ప్రారంభంలో నాట్లు వేసిన పొలాలన్నీ ఒకేసారి కోతకు రావడంతో యంత్రాలకు(హార్వెస్టర్లకు) విపరీతమైన డిమాండ్ పెరిగింది. స్థానికంగా అందుబాటులో ఉన్న యంత్రాలకు తోడుగా ఇతర ప్రాంతాల నుంచి మిషన్ల తెప్పిస్తున్నారు. సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉండే గ్రామాల్లో 5 నుంచి 8, తక్కువ విస్తీర్ణంగల గ్రామాల్లో 3 నుండి 5 హార్వెస్టర్లు అందుబాటులో ఉంటేనే కోతలు సాఫీగా జరిగే అవకాశం ఉన్నది. వానాకాలం మాదిరిగా పొలాలు దిగబడవు. కాబట్టి టైర్ల మిషన్లు అవసరం ఉంటుంది.

మూడో వారం నుంచి కొనుగోళ్లకు అవకాశం

ఈనెల మూడవ వారం నుంచి ధాన్యం కొనుగోళ్లు మొదలయ్యే అవకాశాలు ఉన్నాయి. కొనుగోలు కేంద్రాలు, మిల్లుల కేటాయింపు, ధాన్యం రవాణాకు సంబంధించిన నివేదికను అధికా రులు ఇప్పటికే ప్రభుత్వానికి సమర్పించారు. మొత్తం 300 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఇందులో ఐకేపీ 78, పీఏసీఎస్ 217, మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో 5 కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. అయితే ధాన్యం కొనుగోళ్లకు అధికారులు చెప్పిన సమయం దగ్గరపడుతున్నా ఇంకా సన్నాహాలు ప్రారంభించలేదు. కొనుగోలు కేంద్రాలను గుర్తించడం, మిల్లుల కేటాయింపు చేయలేదు. గోనె సంచులను కూడా సేకరించలేదు. ఇప్పటికే వరి కోతలు మొదలుపెట్టిన రైతులు అకాల వర్షాల భయంతో నేరుగా మిల్లులకు ధాన్యాన్ని తరలిస్తున్నారు.

రెండు మిషన్లు పని చేస్తున్నాయి



ముందుగా నాట్లు వేసిన రైతులు వరి కోతలు ప్రారంభించారు. వారం రోజుల నుంచి రెండు మిషన్లు పని చేస్తున్నాయి. రైతులు మిషన్ల కోసం వస్తున్నారు. ఇంకా ధర నిర్ణయించ లేదు. ఇంధనం ధర, నిర్వహణ ఖర్చు పెరిగింది. గత సీజన్‌లో గంటలకు రూ.1000 నుంచి రూ.2000 వరకు తీసుకున్నాం.

– ఏళ్ల సంతోష్‌రెడ్డి, హార్వెస్టర్ యజమాని

కేంద్రాలను త్వరగా ప్రారంభించాలి



వరికోతలు మొదలయ్యాయి. కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడం వల్ల ధాన్యాన్ని ఎక్కడ పోయాలో తోయడం లేదు. మిల్లులకు అమ్మితే క్వింటాలకు మూడు నాలుగు వందల రూపాయలు తక్కువ వస్తాయి. అంత తక్కువకకు అమ్మితే గిట్టుబాటు కాదు. కాబట్టి అధికారులు చొరవ తీసుకొని త్వరగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి.

– సిలువేరు సత్తయ్య, రైతు, సిరిపురం

ఐదు రోజులకే బదిలీ!

- చర్చనీయాంశంగా యాదగిరిగుట్ట తహసీల్దార్ బదిలీ వ్యవహారం
- ప్రజాప్రతినిధులకు నచ్చకపోవడమేనన్న ప్రచారం



యాదగిరిగుట్ట తహసీల్దార్ కార్యాలయం

యాదగిరిగుట్ట రూరల్ : యాదగిరిగుట్టకు కొత్తగా వచ్చిన తహసీల్దార్ పట్టుమని పది రోజులైనా కాకముందే బదిలీ కావడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ప్రజాప్రతినిధుల ఒత్తిడే కారణమన్న ప్రచారం జరుగుతోంది.

ఏం జరిగిందంటే..

యాదగిరిగుట్ట తహసీల్దార్‌గా పని చేస్తున్న రాము నాయక్ సెక్రటేరియట్‌కు బదిలీ కాగా మార్చి 27న రిలీవ్ అయ్యారు. ఆయన స్థానంలో సంస్థాన్‌నారాయణపురం తహసీల్దార్‌గా పని చేస్తున్న సీహెచ్.శ్రీనివాసరాజు గుట్టకు బదిలీపై వచ్చారు. 28న బాధ్యతలు స్వీకరించారు. ఇంత వరకు బాగానే ఉంది. కానీ, వచ్చిన తహసీల్దార్ ఐదు రోజులకే బదిలీ అయ్యారు. ప్రజాప్రతినిధులు తమకు నచ్చిన అధికారులనే ఇక్కడ కొనసాగిస్తారని, లేదంటే ఒత్తిళ్ల తప్పవని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉండగా నూతన తహసీల్దార్‌గా సెక్రటేరియట్ నుంచి శోభన్ బాబు అనే అధికారి వస్తున్నట్లు తెలిసింది.

పేరుకుపోతున్న ఫైళ్లు

తహసీల్దార్ లేకపోవడంతో 25 రోజులుగా ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయి. కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీతో పాటు ఇతర ఫైళ్లన్నీ నిలిచిపోయాయి.

శ్రీనివాసరాజు బదిలీ అయ్యాడు

యాదగిరిగుట్టకు తహసీల్దార్‌గా బదిలీపై వచ్చిన శ్రీనివాసరాజు శనివారం బదిలీ అయ్యాడు. ఆయన మార్చి 28న బాధ్యతలు స్వీకరించారు. ఆ వెంటనే ఆయన నియామకం క్యాన్సల్ అయ్యింది. ఆయన స్థానంలో మరొకరు సెక్రటేరియట్ నుంచి వస్తున్నారు.

–ఎంవీ భూపాల్‌రెడ్డి, ఆర్డీఓ

నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

- జిల్లా వ్యాప్తంగా 51 కేంద్రాలు, 9,061 మంది విద్యార్థులు



భూదాన్‌పోచంపల్లిలోని పరీక్ష కేంద్రంలో హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

భువనగిరి : పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షల నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా 51 కేంద్రాల ఏర్పాటు చేశారు. మొత్తం 9,061 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30వరకు పరీక్ష ఉంటుంది. సైన్స్‌తో పాటు ప్రథమ భాష పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.50 వరకు నిర్వహిస్తారు. సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలతో పాటు చీఫ్ సూపరింటెండెంట్లు పరీక్షలను పర్యవేక్షించనున్నారు. నియమించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది.

కార్యకర్తలే మా బలం, బలగం

- ప్రభుత్వ విప్ సునీత



సమ్మేళనంలో మాట్లాడుతున్న గొంగిడి సునీత, చిత్రంలో మాజీ మంత్రి మోత్కుపల్లి, డీసీసీబీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి

ఆలేరురూరల్ : బీఆర్‌ఎస్‌కు కార్యకర్తలే బలం, బలగం అని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత అన్నారు. ఆదివారం ఆలేరులో పార్టీ మండలాధ్యక్షుడు గంగుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రం అభివృద్ధిలో మరింతగా ముందుకెళ్లాలంటే సీఎం కేసీఆర్‌తో సాధ్యం అన్నారు. తెలంగాణలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని, మోదీ సర్కార్ వీటిని బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు ప్రవేశపెట్టడం లేదని ప్రశ్నించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కంచర్ల రామకృష్ణారెడ్డి, మోత్కుపల్లి నర్సింహులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పథకాలతో పాటు సొంత జాగా ఉన్న వారికి గృహలక్ష్మి పథకం కింద రూ.3లక్షల ఆర్థిక సాయం అందజేసే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, జెడ్పీటీసీ పల్లా వెంకట్‌రెడ్డి, పార్టీ ఆలేరు పట్టణ అధ్యక్షుడు పుట్టమల్లేషం, మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవివెంకటేష్, కౌన్సిలర్లు నర్సింహులు, బేతిరాములు, సింగిల్ విండో చైర్మన్ మల్లేశం, వైస్ చైర్మన్ చంద్రకళ, దాసి సంతోష్, బాలస్వామి, మురళీ, కుండె సంపత్, సర్పంచులు లక్ష్మీప్రసాద్ రెడ్డి, మహేందర్‌రెడ్డి, రాంప్రసాద్, పూల శ్రవణ్, సిద్దులు, అంజయ్య, శంకర్, పంతం కృష్ణ, ధశరథ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవకు రాష్ట్ర స్థాయి పురస్కారం

- డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య



పౌర సన్మానం అందుకున్న వెల్లంకి పంచాయతీ పాలకవర్గం

రామన్నపేట : వెల్లంకి అభివృద్ధికి సర్పంచ్ ఎడ్ల మహేందర్‌రెడ్డితో పాటు పాలకవర్గం నిస్వార్థంగా చేసిన సేవకు రాష్ట్రస్థాయి పురస్కారంతో తగిన గుర్తింపు లభించిందని దాశరథి పురస్కార గ్రహీత, డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య అన్నారు. రాష్ట్రస్థాయి పురస్కారం అందుకున్న సర్పంచ్ మహేందర్‌రెడ్డితో పాటు పాలకవర్గానికి గ్రామస్తులు ఆదివారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భగవంతుని ఆశీస్సులతో జాతీయ పురస్కారం కూడా వస్తుందని ఆశాభావం వ్యక్తం చే శారు. సర్పంచ్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ పాలకవర్గం, గ్రామస్తులందరి సహకారం వల్లే రాష్ట్రస్థా యి పురస్కారం దక్కిందని, ఇదే స్ఫూర్తితో మున్ముందు కూడా గ్రామ అభివృద్ధికి పాటుపడతానన్నారు. ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య గ్రామాభివృద్ధికి పెద్దమొత్తంలో నిధులు మంజూరు చేశారని పేర్కొన్నారు. పురస్కారాన్ని గ్రామస్తులకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. ఎంపీటీసీ తిమ్మాపురం మహేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సన్మానసభలో పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి, ఎంపీటీసీ ఎర్రోళ్ల లక్ష్మమ్మ, ఎంపీడీఓ గాదె జలేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మందడి ఉదయ్‌రెడ్డి, సర్పంచ్‌లఫోరం మండల అధ్యక్షుడు గుత్తా నర్సింహారెడ్డి, ఉపసర్పంచ్ రవ్వ అనసూయ, మాజీ సర్పంచ్‌లు తాళ్లపల్లి సత్తిరెడ్డి, పున్న నారసింహ, మాజీ ఎంపీటీసీ ఎర్రోళ్ల సుక్కమ్మ, వివిధ పార్టీలు, సంఘాల అధ్యక్షులు ఎడ్ల సురేందర్‌రెడ్డి, పోచబోయిన నర్సింహ, కర్రె రమేష్, ఇడెం శ్రీనివాస్, కొంగరి జానయ్య వార్డు సభ్యులు కె.రాజలింగం, పి.జయలక్ష్మీ, జె.శాంతి, ఎస్.ఎల్లయ్య, ఎం.సరిత, బి.సరిత, జి.కర్ణాకర్‌రెడ్డి, ఎ.సంజీవరెడ్డి, కె.నరేష్, కోఆప్షన్‌సభ్యులు తూడి మురళీధర్, డి.రంగయ్య, టి.పద్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కూరెళ్ల విఠలాచార్య

పిట్టలవారి బతుకు పోరాటం!

- ఆదరణ కోల్పోయిన సంప్రదాయ వృత్తి
- ప్రత్యామ్నాయంగా పండ్ల తోటలను గుత్తకు పడుతూ జీవనం
- ఏటా ప్రకృతి వైపరీత్యాలకు దెబ్బతింటున్న తోటలు
- ఈసారి కూడా వడగండ్ల వర్షాలకు తీవ్ర నష్టాలు
- ప్రభుత్వపరంగా ఆదుకోవాలని వేడుకోలు



ఆత్మకూర్(ఎం) వద్ద మామిడి తోటలో గుడారాలు వేసుకుని నివాసం ఉంటున్న పిట్టలగూడెం వాసులు

ఆత్మకూరు(ఎం) : జంతువులు, పక్షులను వేటాడే వృత్తి వారిది.. కాలక్రమేణా నమ్ముకున్న వృత్తి ఆదరణ కోల్పోవడంతో జీవనోపాధికోసం ప్రత్యామ్నాయ పనులు ఎంచుకున్నారు. పండ్ల తోటలు గుత్తకు పడుతూ వచ్చిన ఆదాయంతో కుటుంబాలను పోషించుకుంటున్నారు. కానీ, లక్షల రూపాయలు వెచ్చించి గుత్తకు తీసుకున్న తోటలు ఏటా ప్రకృతి వైపరీత్యాలకు దెబ్బతినడం పరపాటిగా మారింది. ఇటీవల కురిసిన వడగండ్ల వానకు మామిడి కాయలు నేలరాలి తీవ్రంగా నష్టపోయారు. తోటలనే నమ్ముకున్న తమకు నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నారు.. ఆత్మకూరు(ఎం) మండలం కాల్వపల్లి సమీపంలోని పిట్టలగూడెం వాసులు.

పండ్ల తోటలు గుత్తకు పడుతూ జీవనం

పిట్టలగూడెంలో సుమారు 80 కుటుంబాల వరకు ఉంటాయి. వీరంతా ఆదినుంచి నమ్ముకున్న వృత్తి నిరాదరణకు గురవడంతో 15 సంవత్సరాల నుంచి శీతాఫలాలు, మామిడి ఇతర తోటలు గుత్త పడుతున్నారు. గూడు వదిలి తోటల వద్దనే గుడారాలు ఏర్పాటు చేసుకొని నివాసం ఉంటున్నారు. ఎప్పటిలాగే ఈ సారి కూడా మామిడి తోటలు గుత్తకు తీసుకున్నారు. కాత, తోట విస్తీర్ణాన్ని బట్టి గుత్త డబ్బులు చెల్లించారు. తక్కువలో తక్కువ రూ.4లక్షల నుంచి రూ.8లక్షల వరకు చెల్లించినట్లు గుత్త పట్టిన వ్యక్తులు చెబుతున్నారు. రైతులు వారి వద్ద నుంచి ముందే డబ్బులు కట్టించుకొని తోటలను అప్పగిస్తారు.

శాపంగా మారిన అకాల వర్షాలు

ఆత్మకూర్(ఎం) మండలంలో 928 ఎకరాల్లో రైతులు మామిడి తోటలు సాగు చేశారు. దీంతో పాటు మోటకొండూరు, మోత్కూరు మండల పరిధిలోనూ మామిడి తోటలు ఉన్నాయి. పిట్టలోల్లు ఆయా మండలాల పరిధిలో ఉన్న కప్రాయపల్లి, మోదుగుకుంట, టి.రేపాక, ఆత్మకూరు(ఎం), పుల్లాయిగూడెం, పల్లెర్ల, చామపురం, చాడ, పాలడుగులో మామిడి తోటలను గుత్తకు తీసుకున్నారు. కాగా ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలు వారి పాలిట శాపంగా మారాయి. గడిచిన పది రోజుల్లో ఒక్క ఆత్మకూర్(ఎం) మండలంలో మూడు సార్లు వడగండ్ల వర్షం కురిసింది. దాదాపు 100 ఎకరాల్లో మామిడి కాయలు నేల రాలాయి. ఉద్యానవన శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టాన్ని అంచనా వేశారు.

ఆశలు నేలపాలు



వడగండ్ల వానకు కాయలన్నీ రాలిపోవడంతో వెలవెలబోతున్న మామిడి చెట్లు

ఈ సారి మామిడి కాత తక్కువగా ఉంది. డిమాండ్ ఉండడంతో పాటు మంచి లాభాలు వస్తాయని తోటలు గుత్తకు పట్టిన పిట్టలగూడెం వాసులు ఆశించారు. కానీ, వడగండ్లకు కాయలన్నీ రాలిపోవడంతో తోటలు వెలవెలబోతున్నాయి. లక్షల రూపాయలు అప్పు తెచ్చి గుత్త పడితే తీవ్రంగా నష్టపోయామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

రూ.6 లక్షలు వెచ్చించాను



ఐదు సంవత్సరాలుగా తోటలు గుత్తకు పడుతున్నా. ఎంతోకొంత లాభం వస్తుంది. ఈ సారి కూడా రూ.6లక్షలు వెచ్చించి మామిడి తోట గుత్తకు తీసుకున్న. కాత తక్కువగా ఉండడంతో డిమాండ్ పెరిగి మంచి లాభం వస్తుందని ఆశించా. కానీ, వడగండ్లకు కాయలు చాలా వరకు రాలిపోయాయి. గుత్తకు చెల్లించిన డబ్బులు సగం కూడా వెళ్లే పరిస్థితి లేదు.

– కాలియ రాములు, పిట్టలగూడెం

ప్రభుత్వం ఆదుకోవాలి



ఆధరణ కోల్పోవడంతో కుల వృత్తికి దూరం అయ్యాయి. 15 ఏళ్లగా తోటలను గుత్తకు పట్టుకొని బతుకుతున్నం. ఆత్మకూరు(ఎం), పుల్లాయిగూడెం, పాలడుగు, టి.రేపాకలో తోటలు పట్టినం. రూ.10లక్షలు అప్పు తెచ్చినం. బతుకుదెరువు కోసం తోటలు పడితే వడగండ్ల వానతో అంతా పోయింది. ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

– కాలియ లక్ష్మణ్, పిట్టలగూడెం

క్లుప్తంగా

అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ లభ్యం

● కుటుంబ సభ్యులకు అప్పగింత



కుదురుపాక సోమయ్యతో పోలీసులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : మున్సిపాలిటీ పరిధిలోని మాలిపురం గ్రామానికి చెందిన కుదురుపాక సోమయ్య గతేడాది నవంబర్ 5న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. అతడి భార్య శోభ ఇచ్చిన ఫిర్యాదు స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. కాగా సోమయ్య సెల్ ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా తిరుపతిలో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు అతడిని తిరుమలగిరికి తీసుకొచ్చి ఆదివారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. తన భర్త ఆచూకీ కనిపెట్టినందుకు సోమయ్య భార్య పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



కాశయ్య (ఫైల్)

నల్లగొండ రూరల్ : అనారోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని దోనకల్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దోనకల్ గ్రామానికి చెందిన కొత్తపల్లి కాశయ్య(40)కు భార్య కళ్యాణి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలకు తోడు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న అతడు ఆదివారం తన వ్యవసాయ బావి వద్ద పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమీపంలోని రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి ఆటోలో జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు నల్ల గొండ రూరల్ ఎస్సై కంచర్ల భాస్కర్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో జెడ్పీ కార్యాలయ ఉద్యోగి మృతి

భువనగిరి: భువనగిరి జెడ్పీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సాదు వినయ్‌కుమార్ శనివారం బైక్‌పై హైదరాబాద్‌కు వెళ్లి రాత్రి తిరిగి భువనగిరికి వస్తుండగా మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం ఆదివారం మృతదేహాన్ని భువనగిరి పట్టణంలోని కుమ్మరివాడలో ఉన్న ఆయన స్వగృహానికి తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న భువనగిరి జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భువనగిరి : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి పట్టణంలోని తాతానగర్‌కు చెందిన వెంకటేష్(49) గత నెల 29న పట్టణంలోని జిల్లా కేంద్ర ఆస్పత్రికి సమీపంలో హైదరాబాద్–వరంగల్ ప్రధాన రోడ్డు దాటుతుండా బైకు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణయ్య తెలిపారు.

కేసీఆర్ పాలనలో రాష్ట్రం సుభిక్షం



సూర్యాపేట రూరల్ : మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

● విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట రూరల్: సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని తాళ్లఖమ్మంపహాడ్, కాసరబాద్ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభించారు. సుమారు రూ.80లక్షలతో నూతనంగా నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాల్, బీసీ కమ్యూనిటీ హాల్, బస్ షెల్టర్, ఓపెన్ జిమ్‌లను ప్రారంభించడంతో పాటు రూ.10లక్షలతో నిర్మించనున్న గ్రంథాలయ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజల కడుపు కొట్టుడు కాంగ్రెస్, బీజేపీ కల్చర్ అయితే అన్నం పెట్టుడు బీఆర్ఎస్ సంస్కృతి అన్నారు. బీజేపీ పాలనలో దేశంలో 30శాతం మంది ప్రజలకు ఒంటిపూట భోజనంతోనే సరిపెట్టుకుంటున్నారని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులు పండించిన ప్రతి గింజను కొంటున్న ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. గత పాలకుల హయాంలో రాజకీయ కొట్లాటలు, కేసులు తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. ఒకప్పుడు కాంగ్రెస్‌ను తిట్టిన నాయకులు మళ్లీ వేషాలు మార్చుకొని అబద్ధపు మాటలతో గ్రామాల్లో తిరుగుతున్నారని వారి అబద్ధపు మాటలను ప్రజలు నిలదీయాలన్నారు. కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షులు, ఎంపీటీసీ ముదిరెడ్డి సంతోష్‌రెడ్డి, ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ జీడి భిక్షం, మండల అధ్యక్షులు వంగాల శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనివాస్ నాయుడు, మాజీ సర్పంచ్ హన్మంతు తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేట : ఇఫ్తార్ విందులో పాల్గొన్న మంత్రికి ఖర్జూర తినిపిస్తున్న ముస్లిం మతపెద్ద

ఇఫ్తార్ విందులో పాల్గొన్న మంత్రి..

సూర్యాపేట: అల్లా బోధనలను ప్రతిఒక్కరూ పాటించాలని మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేటలోని 48వ వార్డు కూరగాయల మార్కెట్‌లో నూతనంగా నిర్మించిన మజీద్‌ను మంత్రి ప్రారంభించి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తాయన్నారు. గత ప్రభుత్వాలు మైనార్టీలను కేవలం ఓటు బ్యాంక్‌లా మాత్రమే చూశారని, సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలోనే మైనార్టీలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతున్నారన్నారు. ఆయన వెంట రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, మీరావలీ, రియాజ్, తాహెర్ పాషా, సల్మా, అక్తర్ మౌలానా, గాయాజ్, ఖలీల్, అబ్దుల్ బారీ, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

కుట్రపూరితంగా భిక్షంగౌడ్ సస్పెన్షన్

● ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటమిలో ఆయన పాత్ర లేదు
● పీఆర్‌టీయూని బలహీనపరిచేందుకు కుట్ర
● యాదాద్రి ఆలయంలో ప్రమాణానికి సిద్ధమా..?
● సంఘం కార్యాలయం వద్ద నిరసన దీక్షను ప్రారంభించిన ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, భాస్కర్‌రావు
● సస్పెన్షన్ ఎత్తివేసే వరకు దీక్ష కొనసాగుతుంది: సుంకరి భిక్షంగౌడ్



దీక్షను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, నల్లమోతు భాస్కర్‌రావు



మద్దతు తెలుపుతున్న వివిధ సంఘాల నాయకులు

రామగిరి(నల్లగొండ): పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సుంకరి భిక్షంగౌడ్‌ను యూనియన్ నుంచి సస్పెండ్ చేయడం కుట్రపూరితమని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. తన సస్పెన్షన్‌ను ఖండిస్తూ సుంకరి భిక్షంగౌడ్ ఆదివారం నల్లగొండలోని పీఆర్‌టీయూ జిల్లా కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన దీక్షను ఎమ్మెల్యేలు ప్రారంభించారు. అనంతరం నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. సుంకరి భిక్షంగౌడ్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికై నిత్యం పోరాటం చేశారే తప్ప ఏనాడు సంఘం వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడలేదన్నారు. నల్లగొండ జిల్లాకు సంబంధం లేని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థి ఓటమి విషయంలో భిక్షంగౌడ్ పాత్ర ఉందని యూనియన్ నుంచి సస్పెండ్ చేయడం సరికాదన్నారు. అసలు రంగారెడ్డి–మహబూబ్‌నగర్–హైదరాబాద్ ఉపాధ్యాయ ఎన్నికల్లో పీఆర్‌టీయూ అభ్యర్థే ఓటమికి ప్రధాన కారణమన్నారు. ఒకే సంఘం నుంచి ఇద్దరు అభ్యర్థులు పోటీ చేయడం వల్లే పీఆర్‌టీయూ ఓటమి పాలైందన్నారు. అంతే కాకుండా గతంలో రెండుసార్లు జిల్లాకు చెందిన పీఆర్‌టీయూ అభ్యర్థి ఎమ్మెల్సీగా గెలువడానికి భిక్షంగౌడ్ ఎంతో కృషిచేశారని గుర్తుచేశారు. సదరు ఎమ్మెల్సీ ఇప్పుడు భిక్షంగౌడ్‌పై నిరాధారణమైన ఆరోపణలు చేస్తూ యూనియన్ నుంచి సస్పెండ్ చేయించడం బాధాకరమన్నారు. భిక్షంగౌడ్‌పై చేసిన ఆరోపణలు నిజమే అయితే యాదాద్రి ఆలయంలో ప్రమాణం చేసి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. భిక్షంగౌడ్‌కు ఐటీ మంత్రి కేటీఆర్, మంత్రి జగదీశ్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి అండదండలు ఎప్పటికీ ఉంటాయన్నారు. పీఆర్‌టీయూ రాష్ట్ర కమిటీ ఇప్పటికైనా పునరాలోచించుకుని తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సూచించారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావు మాట్లాడుతూ.. జిల్లాకు సంబంధం లేని ఎన్నికల్లో పీఆర్‌టీయూ అభ్యర్థి ఓటమి పాలైతే భిక్షంగౌడ్‌ను బాధ్యుడిని చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా సస్పెన్షన్ ఎత్తివేసి భిక్షంగౌడ్‌ను జిల్లా అధ్యక్షుడిగా కొనసాగించాలన్నారు.

నిరాధారమైన ఆరోపణలు..

ఈ సందర్భంగా సుంకరి భిక్షంగౌడ్ మాట్లాడుతూ.. నిరాధారమైన ఆరోపణలతో తనను సస్పెండ్ చేశారని అన్నారు. 24 ఏళ్లుగా పీఆర్‌టీయూ అభివృద్ధి కోసం అహర్నిషలు కృషి చేశానన్నారు. గత 14 ఏళ్లుగా పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడిగా ఉపాధ్యాయ సమస్యలను దగ్గరుండి పరిష్కరించానన్నారు. రంగారెడ్డి–మహబూబ్‌నగర్–హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో జిల్లాలోని మాల్, చింతపల్లి, డిండి ప్రాంతాల నుంచి 300 ఓట్లు ఉండగా, వాటికి తనను ఇన్‌చార్జి ఇవ్వమని కోరినా ఇవ్వలేదన్నారు. 30వేల ఓట్లున్న ఎమ్మెల్సీ ఎన్నికలో పీఆర్‌టీయూ ఓటమికి తాను ఎలా బాధ్యుడనని ప్రశ్నించారు. తనకు బీజేపీ నుంచి డబ్బులు ముట్టినట్లు దుష్ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే వరంగల్–నల్లగొండ–ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాను ఎక్కడ పోటీలో ఉంటానోనని రాష్ట్ర కమిటీ ఈ నిర్ణయం తీసుకుందన్నారు. తనపై మూడు రోజుల్లో తనపై సస్పెన్షన్ ఎత్తివేయకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు చీర పంకజ్‌యాదవ్, సుంకరి మల్లేష్‌గౌడ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేతి రఘుపతి, బకరం శ్రీనివాస్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ, గండిచెరువు వెంకన్న, కాంగ్రెస్ పార్టీ నాయకుడు తండు సైదులుగౌడ్, తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు పన్నాల గోపాల్‌రెడ్డి, తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య, జిల్లా అధ్యక్షుడు పందుల సైదులు, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్దన్‌గౌడ్ పాల్గొని నిరసన దీక్షకు సంఘీభావం తెలిపారు.

ముగిసిన జాతీయ భద్రతా వారోత్సవాలు



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న పరిశ్రమల శాఖ అధికారులు, దివీస్ ప్రతినిధులు

చౌటుప్పల్: మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామంలో గల దివీస్ ఫార్మా పరిశ్రమలో నిర్వహిస్తున్న జాతీయ భద్రతా వారోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి పరిశ్రమల శాఖ రాష్ట్ర డైరెక్టర్ బి. రాజగోపాల్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దివీస్ పరిశ్రమలో ఏర్పాటు చేసిన భద్రతా విధానాలను అభినందించారు. దివీస్ పరిశ్రమ మాదిరిగా ఇతర పరిశ్రమల యాజమాన్యాలు కూడా భద్రత విషయంలో ఏమాత్రం రాజీపడొద్దన్నారు. దివీస్ జనరల్ మేనేజర్ ఎస్. రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ రాష్ట్ర జాయింట్ ఇన్‌స్పెక్టర్ వై. మోహన్‌బాబు, నల్లగొండ జిల్లా పరిశ్రమల అధికారి నితిన్‌కుమార్, దివీస్ జనరల్ మేనేజర్ పెండ్యాల సుధాకర్, ప్రతినిధులు బాలకిషోర్, సాంబశివరావు, బీకేకేచౌదరి, శివప్రసాద్, ఉద్యోగులు, కార్మికులు, తదితరులు ఉన్నారు.

ఎదురెదురుగా ఢీకొన్న ఆర్టీసీ బస్సు, బైక్

● యువకుడు మృతి, మరొకరి పరిస్థితి విషమం



రాజు (ఫైల్)



ఘటనా స్థలంలో గుమిగూడిన స్థానికులు

తుర్కపల్లి: ఆర్టీసీ బస్సు, బైక్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతిచెందగా, మరొకరికి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన తుర్కపల్లి మండలంలోని మాధాపూర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మాధాపూర్ గ్రామానికి చెందిన జాలిగం రాజు(25) ఆదివారం తన మిత్రుడు మేకల శ్రీకాంత్‌తో కలిసి గ్రామ శివారులోని పెట్రోల్ బంక్‌లో బైక్‌లో పెట్రోల్ కొట్టించుకుని ఊర్లోకి వస్తుండగా జనగామ జిల్లా చేర్యాల నుంచి ఈసీఐఎల్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజు, శ్రీకాంత్‌కు తీవ్రగాయలయ్యాయి. స్థానికులు వెంటనే 108 వాహనంలో వారిని భువనగిరి తరలిస్తుండగా మార్గమధ్యలో రాజు మృతిచెందాడు. శ్రీకాంత్ పరిస్థితి విషమంగా ఉంది. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్‌ఐ రాఘవేందర్‌గౌడ్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు పక్కన టిఫిన్ చేసిన 'బండి'



కార్యకర్తలతో టిఫిన్ చేస్తున్న బండి సంజయ్

సాక్షి యాదాద్రి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఆదివారం భువనగిరిలో రోడ్డు పక్కన అల్పాహారం చేశారు. భువనగిరి సమీపంలో రోడ్డు పక్కనున్న మొబైల్ క్యాంటీన్ వద్ద కార్యకర్తలతో కలిసి అల్పాహారం చేసి ములుగు జిల్లాలో జరిగే అసెంబ్లీ నియోజకవర్గ బూత్ కమిటీ సమ్మేళనానికి బయలుదేరి వెళ్లారు. క్యాంటీన్ నిర్వాహకులతో మాట్లాడి హోటల్ ఎలా నడుస్తుందని వివరాలు అడిగి తెలుసుకున్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజల సమస్యలు తీరుతాయని అన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

భువనగిరి: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం రాత్రి భువనగిరి పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఎల్‌బీనగర్‌కు చెందిన సామల రమేష్(42) నల్లగొండ మున్సిపాలిటీలో నీటి సరఫరా విభాగంలో పనిచేస్తున్నాడు. కాగా శనివారం రాత్రి ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

20 గొర్రెల అపహరణ

యాదగిరిగుట్ట రూరల్: గుర్తుతెలియని వ్యక్తులు 20 గొర్రెలను అపహరించిన సంఘటన మండలంలోని వంగపల్లిలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. వంగపల్లికి చెందిన గొర్రెల కాపరి కాలే నర్సయ్య రోజుమాదిరిగా శనివారం ఉదయం తన గొర్రెలను మేతకు తీసుకెళ్లి, రాత్రి సమయంలో షెడ్డులోకి తోలి ఇంటికి వెళ్లిపోయాడు. ఆదివారం ఉదయం వచ్చి చూడగా మందలోని 20 గొర్రెలు కనబడలేదు. షెడ్డు దగ్గర వాహనాలకు సంబంధించిన గుర్తులు కనబడడంతో, తన గొర్రెలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదయ్య తెలిపారు.

మోసం చేసిన వ్యక్తికి రిమాండ్

రాజాపేట: ఒకే స్థలాన్ని ఇద్దరికి విక్రయించి మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం తెలిపారు. వివరాలు.. హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్‌కు చెందిన సయ్యద్ హఫీజ్ మండలంలోని నెమిల రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 74లోని 108/3లో కల్లూరి ప్రశాంత్ అనే వ్యక్తి చేసిన వెంచర్‌లో ప్లాట్ కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. తాను కొనుగోలు చేసిన స్థలానికి పొజీషన్ చూపించమని ఎన్నిసార్లు అడిగినా చూపించలేదని, ఆ స్థలం వద్దకు వెళ్లి చూడగా అక్కడ వెంచర్ లేదని, వ్యవసాయ భూమి ఉందని సయ్యద్ హఫీజ్ గుర్తించాడు. నకిలీ పత్రాలు సృష్టించి తనను మోసం చేసిన ప్రశాంత్‌పై పోలీసులకు సయ్యద్ హఫీజ్ ఫిర్యాదు చేశాడు. అంతేకాకుండా తమకు విక్రయించిన స్థలాన్ని తిరిగి మరో వ్యక్తికి విక్రయించినట్లు తెలిసిందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు ప్రశాంత్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మద్దిరాలలో ఈదురుగాలుల బీభత్సం



కుక్కడం గ్రామంలో వీధుల్లో పడిన రేకులు



కుక్కడం గ్రామంలో రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు



లాక్యతండాలో నేలకొరిగిన వరి చేను

మద్దిరాల: మండల పరిధిలోని కుక్కడం, లాక్యతండా, గుమ్మడవెల్లి, రెడ్డిగూడెం, కుంటపల్లి గ్రామాల్లో ఆదివారం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ఈ ఈదురుగాలులతో మామిడి కాయలు నేలరాలాయి. వరి పొలాలు, మొక్కజొన్న పంట, మిరప తోటలు నేలకొరిగాయి. ఇళ్ల పైకప్పులు లేచిపోయాయి. కుక్కడం గ్రామానికి చెందిన నల్లగంటి పూలమ్మ ఇంటి పైకప్పు లేచిపోవడంతో ఇంట్లోని దాదాపు 50క్వింటాళ్ల పత్తి తడిసిపోయింది. లాక్యతండాకు చెందిన బానోతు రాజుకు చెందిన మిర్చి, మొక్కజొన్న, వరి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. రోడ్ల వెంట చెట్లు విరిగిపడి రాకపోకలకు అంతరాయం కలిగింది. పలువురి ఇళ్లపై చెట్లు విరిగిపడ్డాయి. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

మామ ఇంటి ఎదుట అల్లుడి ఆందోళన

● తన కుమారుడిని చూపించాలని తల్లిదండ్రులతో కలిసి భైఠాయింపు



తల్లిదండ్రులతో కలిసి ధర్నా చేస్తున్న అల్లుడు

కోదాడ : కోర్టు ఆదేశాల మేరకు తన కొడుకును చూపాలని కోరుతూ ఓ యువకుడు తన తల్లిదండ్రులతో కలిసి మామ ఇంటి ముందు ధర్నాకు దిగాడు. కోదాడలో ఆదివారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. కోదాడకు చెందిన ముత్తినేని సైదేశ్వరరావు కుమార్తెకు హైదరాబాద్‌కు చెందిన దాసరి వెంకట ప్రవీణ్‌తో 2018లో వివాహం జరిగింది. ఈ దంపతులకు కుమారుడు జన్మించాడు. ఆ తర్వాత వీరిద్దరి మధ్య మనస్పర్థలు ఏర్పడడంతో వేర్వేరుగా ఉంటున్నారు. ఈ క్రమంలో ప్రవీణ్ భార్య కెనడా వెళ్లింది. తన కుమారుడు కౌటిల్య కోదాడలో ఉంటున్న తాత సైదేశ్వరరావు వద్దే ఉంటున్నాడని ప్రవీణ్ అంటున్నాడు. తాను కొడుకు కోసం కోర్టుకు వెళ్లగా ప్రతి వారం కుమారుడిని చూపాలని కోర్టు ఆదేశాలు ఇచ్చిందని, కానీ సంవత్సరంన్నర నుంచి కొడుకును చూపడం లేదని కోదాడలోని మామ ఇంటి ముందు తన తల్లిదండ్రులతో కలిసి ధర్నాకు దిగాడు. సైదేశ్వరరావు ఇంటి తలుపులు తీయకపోవడంతో ఉదయం నుంచి సాయంత్రం 6గంటల వరకు వారు అక్కడే భైఠాయించి వెళ్లిపోయారు.

భారీగా గంజాయి పట్టివేత?

కోదాడరూరల్: ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణలోకి అక్రమంగా రవాణా అవుతున్న గంజాయిని కోదాడ మండలంలోని రామాపురం క్రాస్‌రోడ్ వద్ద ఏర్పాటుచేసిన అంతరాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద ఆదివారం రాత్రి పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ కారులో భారీగా గంజాయి పట్టుబడినట్లు తెలుస్తోంది. కారుతో పాటు నిందితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. పూర్తివివరాలను పోలీసులు త్వరలో వెల్లడించే అవకాశం ఉంది.

కూరగాయల సాగులో సరైన మెళకువలు పాటించాలి

● కోదాడ మండల ఉద్యానవన అధికారి అనిత

పాడి పంట



సాగులో ఉన్న బెండ పంట

నడిగూడెం: వేసవిలో అధిక ఉష్ణోగ్రత, వాతావరణంలో ఉండే తక్కువ తేమ కూరగాయల సాగుకు ప్రతిబంధకమవుతుంది. రైతులు సరైన మెళకువలు, యాజమాన్య పద్ధతులు పాటిస్తే వేసవిలో కూరగాయల సాగుతో అధిక లాభాలు పొందవచ్చని కోదాడ మండల ఉద్యానవన అధికారి అనిత చెబుతున్నారు. వేసవిలో కూరగాయల సాగులో పాటించాల్సిన మెళకువలు ఆమె మాటల్లోనే..

వేసవిలో కూరగాయల నారు నీడలో పెంచాలి. తప్పనిసరిగా రసం పీల్చే పురుగుల నివారణకు ఇమిడిక్లోప్రిడ్ (5 గ్రాములు కిలో విత్తనానికి)తో విత్తనశుద్ధి చేయాలి. నారుమళ్లపై నైలాన్ వల ఏర్పాటు చేసుకుంటే కూడా రసం పీల్చే పురుగులు, తెగుళ్ల సమస్యను అధిగమించవచ్చు. పొలంలో మొక్కలకు నీడనిచ్చే విధంగా ఆముదం, మొక్కజొన్న లాంటి పంటలను ఉత్తర దక్షిణ దిశలో నాటుకోవాలి. లేదా 35 శాతం షేడ్ నెట్‌లను ఏర్పాటు చేసుకుంటే ఎండ తీవ్రతను తగ్గించి మంచి దిగుబడులు పొందవచ్చు.

❖ కొత్తగా నాటిన మామిడి, జామ, కొబ్బరి వంటి పండ్ల తోటలల్లో మొదటి 3–4 సంవత్సరాలు అంతరపంటగా బెండ, సొర, బీర, గుమ్మడి, దోస, ఫ్రెంచి చిక్కుడు, గోరుచిక్కుడు వంటి కూరగాయలను సాగు చేసి అదనపు ఆదాయం పొందవచ్చు.

❖ నేలలోని తేమను సంరక్షించే చర్యలు చేపట్టాలి. వీలైనంత ఎక్కువ మోతాదులో సేంద్రియ ఎరువులు, వాటితో పాటు జీవన ఎరువులను వాడితే మంచి ఫలితం ఉంటుంది. సేంద్రియ ఎరువులు ఎక్కువగా వాడడం వలన నేల గుల్లబారి, తేమను ఎక్కువ రోజులు పట్టివుంచి మొక్కకు అందుబాటులో ఉండేటట్లు చేస్తుంది.

❖ బిందు, తుంపర్ల పద్ధతిలో నీటిని ఇవ్వడం వలన కొద్ది నీటితో ఎక్కువ విస్తీర్ణంలో కూరగాయ పంటలను పండించవచ్చు.

❖ ఒక ఎకరానికి సరిపడా నీటితో డ్రిప్ ద్వారా 2.50 ఎకరాలలో, తుంపర్ల పద్ధతిలో 1.50 నుంచి 2.00 ఎకరాలలో కూరగాయలు సాగు చేసుకోవచ్చు. అంతేకాకుండా నీరు సక్రమంగా ఇవ్వడం వలన తుంపర్ల ద్వారా ఎండ వేడి తగ్గి మంచి దిగుబడులు పొందవచ్చు. సాధారణ పద్ధతిలో నీరు ఇచ్చే పంటలలో ఎండ తీవ్రత తగ్గించడానికి అప్పుడప్పుడు సాయంత్రం నీటిని పిచికారీ చేయాలి.

❖ టమాట, పుచ్చలో నీటి యాజమాన్యం సరిగ్గా లేకపోతే కాయలో పగుళ్లు కనబడతాయి. కాయ పగుళ్ల నివారణకు బోరాక్స్ లేదా ఆల్‌బోర్ 3గ్రాములు లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

❖ తీగ జాతి కూరగాయలలో అధిక ఉష్ణోగ్రతకు మగపూలు ఎక్కువగా వస్తాయి. వాటి నివారణకు పూత దశలో సైకోసిల్ 2.5గ్రాముల చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదా గింజ విత్తిన 15 రోజులకు 2–4 ఆకుల దశలోనే 3–4 గ్రాముల బోరాక్స్ లీటరు నీటికి 3గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

❖ యూరియా ఎండ వేడికి త్వరగా ఆవిరికాకుండా మొక్కకు ఎక్కువ రోజులు అందుబాటులో ఉండేలా 9కిలోల యూరియాను ఒక కిలో వేపపిండికి కలిపి వేయాలి. లేదా ప్రతి 25 కిలోల యూరియాకు కిలో వేప నూనె కలిపి అరగంట సేపు ఆరబెట్టి పంటలకు వేయాలి.

❖ పూత, పిందె రాలకుండా పిందె బాగా పట్టడానికి టమాట, వంగ లాంటి పంటకు ఒక మి.లీ. ప్లానోఫిక్స్ 4.5 లీటర్ల నీటిలో కలిపి పూత దశలో వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

❖ కూరగాయలు, ఆకుకూరలను చల్లటి పూట కోసి, తడి గోనె సంచి కప్పి మార్కెట్‌కు పంపాలి.

❖ ఆకుకూరల పంటలలో ఆకు దిగుబడి పెంచడానికి 2 శాతం యూరియా (20 గ్రాములు లీటరు నీటికి)మరియు 50 పిపియ జిబ్బరిల్లిక్ ఆమ్లం (50 మిల్లీగ్రాములు లీటరు నీటికి) ద్రావణాన్ని పిచికారీ చేయాలి.

❖ పొటాష్‌ను సరైన మోతాదులో వాడితే నీటి ఎద్దడిని, చీడపీడలను తట్టుకొనే గుణం మొక్కలలో ఎక్కువగా ఉంటుంది. ప్రతి కిలో యూరియాకు అరకిలో పొటాష్‌ను తప్పనిసరిగా వాడాలి.